# అరణ్యం

ఈ పెళ్ళి చేసుకుని తను ఈ అరణ్యంలో ప్రవేశించటం చాలా పొరపాటయింది. తన భర్త యాభైఏళ్ళ వాడని కాదు, తనకు సంసార సుఖం తక్కువయిందనీ కాదు — ఆ రెంటిని గురించీ తనకు స్పష్టంగా తెలిసి కూడా ఈ భర్తను చేసుకోటానికి ఇష్టపడ్డది. తన భర్త ధనవంతుడు. దారిద్ర్యం కన్న ఎక్కువ పాపం ఇహాన లేదని తన తండ్రి తనను నమ్మించాడు. ఆయన పొరపాటు పడ్డాడని అనుకోవలిసిన అవసరం కూడా తన కిప్పుడు కలగ లేదు.

కాని ఇతర విషయాల మాటేమిటి?— తను పెళ్ళికి పూర్వం ఊహించ లేకపోయిన వెయ్యిన్నొక్క విషయాల మాట!

తను కామోద్రేకంతో చావటం లేదు, నిజమే. లేత లేత మొహాలనూ, నూనూగు మీసాలనూ చూస్తే తనకు శరీరం జల్లుమనటం లేదు. కాని తనకో

ఇప్పుడిప్పుడే పుట్టు కొస్తున్న ఈ కొత్త ఉద్రేకం ఉపశమించే దెట్లా? తన భర్త— ఈ భర్త కాదు— తనకు తగిన భర్త యొక్క కష్టసుఖాల్లో ముఖ్యంగా కష్టాల్లో — పాలుతీసుకోవాలనీ, అతనితో సానుభూతి చూపాలనీ, అతనితో పాటు ఎటువంటి కష్టాలకైనా ఎదురు వెళ్ళాలనీ, అతని ధైర్యానికి తన ధైర్యం జోడించి అతని మనస్సుకు ఇంతే విధంగానూ కలగని ఆనందం చేకూర్చాలనీ తన మనస్సు ఇంతగా పీకుతుందేమిటి? దురదృష్టంలో పాలు తీసుకోదగిన భార్యలూ, అదృష్టంలో పాలు తీసుకో దగిన భార్యలూ— ఆడవాళ్ళు రెండు రకాలేమో! అయితే తను మొదటి రకం అయి ఉండాలి.

ఈ తన ఉద్రేకం తృప్తి అయేటందుకు తన భర్త యాభై యేళ్ళ వాడయినా ఫరవాలేదు, తనకు సంసారసుఖం యివ్వలేకపోయినా ఫరవాలేదు— వెంకటనరసయ్యగారు మాత్రం కాకుండా ఉంటే సరి. తన భర్తగారయిన వెంకట నరసయ్యగారికి ఎటువంటి కష్టాలూ, మనః క్లేశాలూ, హృదయవేదనలూ లేవు. అసలాయనకు తనతో పంచుకునేటందుకు ఏమీ లేదు. ఆఖరుకు మంచం కూడా! ఆ పని వంటలక్కదీ!........

ఎంత ఆలోచించినా బోధ పడదు— తన భర్త తన్ను ఎందుకుగాను పెళ్ళి చేసుకున్నట్టు? వంటలక్క పదువు నిలపటానికి కాదు కద!

తన అత్తవారిల్లు మహారణ్యం. ఇందులో అన్నీ సింహాలూ, పెద్ద పులులూ— అరణ్యంలో ఉండే సింహాలూ పెద్దపులులూ వాటిలో అవి మధ్య మధ్య చూపే అన్యోన్యత మినహా. ఈ జంతువులు ప్రతి క్షణమూ ఒకదాన్నొకటి చూసి గుర్రు మంటూ ఉంటై. ఇవి ఒకదాన్నొకటి కొట్టుకునే దెబ్బలకు తనవంటి సాధు జంతువులు ఆవలించ వలసిందే!

తన భర్తా, తన అత్తగారూ, తన సవతి కూతురు శారదా, తన సవతి కొడుకు భాస్కర్రావూ ఒకరి నొకరు నిజంగా కొట్టుకుంటారని కాదు, కాని మాట లనుకుంటారు! ఆ మాటలు! అంతకంటె దెబ్బలు నయం!........ ఆ నలుగురూ ప్రతి స్వల్ప విషయానికీ ఒకరి నొకరు ప్రతిఘటించుతూ, ఒకరి ఉనికిని ఒకరు ద్వేషించుతూ, ఎవరి మటుకు వారు తమలో ఉన్న దుర్గుణా లన్నిటినీ మిగిలిన వారిలో చూసి మనస్ఫూర్తిగా అసహ్యించుకుంటారు!

ఆ నలుగురిలోనూ భాస్కర్రావే భేదంగా కనపడతాడు. అతనూ ఒక అరణ్య మృగం కాడని కాదు; అతని కాటు మిగిలిన వారి కాటుకంటె కూడా అపాయకరమైనది. అయితే అతను అడివి జంతువు మాత్రం కాదు. (ఆ సంస్కృత శబ్దానికి ఈ తెలుగు పర్యాయ పదానికీ కొంత తేడా ఉంది మరి!) భాస్కర్రావు చాలా తెలివైన వాడు. అదీ కాక అతను నవ్వగలడు— తన్ను చూసి తనే! మిగిలిన ముగ్గురూ అది చెయ్యలేరు.

అసలు రహస్యం ఏమిటంటే, అతనే తనతో అన్నట్టు భాస్కర్రావు వేదాంతి!

"నువు వేదాంతి వని నేను నమ్మను. వేదాంతికి ఇంత ఆగ్రహమా?" అన్నది తను.

"ఆగ్రహం! ఆగ్రహానికి వేదాంతులను చెప్పి మరొకర్ని చెప్పు!" అన్నాడు భాస్కర్రావు ఆశ్చర్యం నటిస్తూ.

"ఆగ్రహానికి లొంగిపోయిన తరవాత నీ వేదాంతం ఎక్కడా?"

"అట్లా అడుగు చెబుతాను. నాకూ నీకూ అభిప్రాయం భేదం వచ్చి, నిన్ను నేను ఏ వాదన చేతా ఒప్పించలే ననుకో. అప్పుడు నేనే రైటని నిరూపించటం ఎట్లా?"

"నాకు తెలీదు!"

"ఈ రహస్యం తెలియకుండా ఎవరూ ఉండరాదు. చెబుతాను విను; నేను అమాంతం నీ గొంతు నులిపి వెయ్యటమే! వంద సంవత్సరాలు ఆలోచించి చెప్పు అంతకంటె మంచి ఉపాయం ఉందేమో!.... ఇక నా వేదాంతం ఎక్కడుందంటే, నేనట్లా నీ గొంతు నులమను." తను నవ్వింది. అతనూ నవ్వాడు.

"బాగా ఉంది! అయితే అంతా వేదాంతులే."

"కారు! అక్కడే పొరపాటు పడుతున్నావు. నామాదిరిగా తన నమ్మకాలలో దృఢ విశ్వాసం ఉన్నవాడు వేదాంతి కూడా అయితే తప్ప రోజూ ఎన్ని హత్యలు చెయ్యవలసి వస్తుందో నువు ఊహించలేవు!........అయినా అది ఒక ఉదాహరణగా చెప్పాను. రోజూ నీ కళ్ళ ఎదట అనేక వేల పనులు, ఎంత మందమతికైనా ఒక క్షణం ఆలోచిస్తే పొరపాట్లుగానూ, జరగగూడనివిగానూ, స్పష్టంగా కనిపించేవి జరుగుతూ ఉంటై. వాటిని చూసి నువు సహించాలి! ఎంత వేదాంతం అవసరమో చూడు నా బోటిగాడికి! మెదడు ఉండటం కూడా ఎంతో పాపం చేసుకున్న వాడికి గాని సంభవించదు. నా కళ్ళ ఎదట జరుగుతున్న వెధవ పనుల కన్నిటికీ నేను కొంత బాధ్యుణ్ణనే అనిపిస్తుంది నాకు. అందరూ రోజూ చేస్తున్న పాపంలో నేను కొంత కొంత పంచుకుంటున్నాను. నేను ఎంత వేదాంతినైతే ఇంత పాపం సహించ గలుగుతున్నా నంటావు?.... నీ పెళ్ళే తీసుకో! నీకు భర్త కాదగినవాణ్ణి, నీకు భర్త అయిన ఆయనతో కులగోత్రాలలోనూ, సంపదలోనూ సమానుణ్ణి, వయసులో అంతకంటె నీకు తగినవాణ్ణి, తెలివితేటల్లో– నే చెప్పుకుంటే బాగుండదు కాని– సామాన్యంగా సాటిలేనివాణ్ణి; నేనిట్లా ఉండగా నిన్ను మా నాన్న చేసుకున్నాడు ఇది తల్లకిందులు పని అని నీకు తట్టకపోతే బజారులో వెళ్ళే వాణ్ణి నిలవేసి అడుగు! ఇందులో నా ఘాగం ఉందా లేదా?...."

తన భర్త అంత దూరాన ఉండగానే! ఆయన కొడుకువంక ఒకసారి తీక్ష్ణంగా చూశాడు కూడానూ! భాస్కర్రావు పెదాలమీది చిరునవ్వు చిరునవ్వు గానే ఉంది, అతని కళ్ళుమాత్రం అంతలో క్రూరంగా అయి పోయినై! ఆ చూపుకు తండ్రి తట్టుకోలేకపోయి ఉండాలి!....

మొత్తానికి విచిత్రమైనవాడు భాస్కర్రావు!.... అతను కూడా తన మాదిరిగా, అరణ్యంలో ఉన్నట్టు భావించటం లేదు కద!.... అతనేదో కొంత బాధ పడుతున్నాడు. తను అతనికి భార్య అయి ఉంటే— అతని బాధ కొంత పంచుకొని ఉంటే— తన కళ్ళ ఎదుట జరుగుతున్న పాపమూ అవినీతీ అతను గమనించకుండా అతని దృష్టిని తన మీదికి తిప్పగలిగితే—అతనింత "వేదాంతి" కావలిసిన అవసరం ఉండేది కాదేమో, పాపం!....

తను చేసుకున్న ఈ పెళ్ళిని గురించి ఏ విధంగా తృప్తి పడదామన్నా లేదే! తను ఫోర్తుఫారం పాసయి ఫిఫ్తు ఫారం చదువుతుండగా తన పదిహేనో ఏట అయింది ఈ పెళ్ళి! "నాకీ సంబంధం వద్దు" అనటానికి స్వేచ్ఛ ఇచ్చాడు తన తండ్రి! ఆఖరుకు ఏమయింది?

ఇటువంటి పనులు సరిగా కావాలంటే ఒక్క వ్యక్తి ప్రయత్నంవల్ల కావేమో?.... తన తండ్రి స్వేచ్ఛ ఇచ్చాడంటే అది ఏం స్వేచ్ఛ? తన మనసు అదివరకే బానిసత్వంలో ఉంది, దారిద్ర్యం మహా పాతకం అనే విశ్వాసానికి కట్టుబడి! తనకు డబ్బుతో కూడా వచ్చిన భర్త ఈ వెంకట నరసయ్యగారు ఒకడే!

"ఎవరైనా మిమ్మల్ని నిలవదీసి అడిగితే మీ పిల్ల రజస్వల కాలేదని మీరు ప్రమాణం చేసేటట్టయితేనే చేసుకుంటాను!" అని ఖండితంగా అన్నాడు తన భర్త తన తండ్రితో.. .ఇటువంటి పెళ్ళికి తను ఎట్లా ఒప్పుకుంది?

* * *

యాభయ్యో యేట ఇంచుమించు వేడుకను చేసుకున్నట్టు రెండో పెళ్ళిని చేసుకున్న తన భర్త, పాపం, ఆ శారదకు మళ్ళీ పెళ్ళి చేసివెయ్యకూడదూ? ఆ పిల్ల అవస్థ తను చూడలేకుండా ఉంది. ఆ పిల్లకు ఎప్పుడో పోయినాడు భర్త. ఇప్పుడు శారద తనకంటే కొద్ది నెలలు మాత్రమే పెద్ద. పెళ్ళి చేస్తే శారద సుఖపడుతుంది. తన మాదిరి మనిషి కాదు. తను సుఖపడి భర్తను సుఖ పెట్టు తుంది. (నూటికీ కోటికి ఓసారి దగ్గిరికి వచ్చే భర్తనే తను సుఖపెట్ట లేకుండా ఉంది.)

చూస్తే శారద మనసుకు ఎప్పుడూ అదే ఆలోచనల్లే ఉంది. ఎప్పుడూ పరధ్యానంగా ఉంటుంది. పలకరిస్తే చీదరించుకుంటుంది. ఎప్పుడూ ఒంటరిగా కూర్చుంటుంది....అయినా తన కెందుకు?....

* * *

శారద విషయం తను జోక్యం కలుగ చేసుకోవటం భావ్యంగా ఉంటుందో ఉండదో? వయసులో తనకన్న పెద్దదే కాని అజ్ఞానురాలు. ఎప్పటి కైనా పెళ్ళి చేసుకుని సుఖ పడటానికి ఉన్న కాస్త అవకాశమూ ఆ పిల్ల అవివేకంగా ప్రవర్తించి చూస్తూ చూస్తూ పోగొట్టుకుంటుందేమో? మన కెందుకని చూస్తూ ఊరుకోవటం వేదాంతం కావచ్చు కాని ధర్మమా?

తను తన భర్తతో మాటవరసకు, "శారదకు పెళ్ళి చెయ్యరాదా?" అంటే ఆయన ఇంత ఎత్తున ఎగిరిపడి, "నా చేతిమీదుగా నేను చెయ్యను. మొగుడు కావలసినప్పుడు ఎవరితోనూ చెప్పకుండా అదే లేచిపోతుంది. పాపమూ పుణ్యమూ నాకక్కర్లేదు. నే నిటువంటి పనులు చేసి నలుగురి చేతా తప్పు పట్టించుకోను," అన్నాడు.

శారదతోనే మంచిగా చెప్పటానికి, శారద మంచిగా తీసుకుంటుందని నమ్మకం ఏమిటి? అదీకాక ఆ పిల్ల ఉన్న స్థితిలో ఆ పిల్లకు మంచి రుచిస్తుందా?

వేళకానివేళ శారద వాకిట్లో చిటికేశ్వరపు చెట్టుకిందికి వెళ్ళి అందని కొమ్మల పూలు కొయ్యటానికి విశ్వ ప్రయత్నం చేసి, ఆఖరుకు కింద రాలినవో అందే కొమ్మలివో రెండు పూలు తుంచి చేతులో ఆడించుకుంటూ వస్తూండటం తను గమనించి కూడా అర్థం చేసుకోలేదు. ప్రహరీ గోడ పొట్టిగా ఉండటం వల్లా, బయట రోడ్డు ఎత్తుగా ఉండటం వల్లా ఆ చెట్టుకింద నిలబడితే రోడ్డుమీద పొయ్యేవాళ్ళు కనిపిస్తారు. వాళ్ళకు చెట్టుకింది మనిషి కనిపిస్తుంది. శారద నలుగురినీ చూడటానికీ నలుగురికీ కనిపించటానికీ ఇట్లా చేస్తున్నదేమో లెమ్మను కుంది తను. ప్రత్యేకం ఒకడున్నాడని చాలా రోజుల దాకా తెలియలేదు - తను స్వయంగా వాణ్ని చూసేదాకా!

వాళ్ళిద్దరి పరిచయమూ ఎంత వరకు వెళ్ళిందో? వాడు తనవంక కూడా చూచాడు - ఒక వెధవ చూపు! అటువంటి చూపుకే పడి ఉంటుంది శారద.

*  *  *

కిందటి రాత్రి శారద - ఎప్పుడు కిందికి వెళ్ళిందో ఏమో - పది గంట లప్పుడు చప్పుడు చెయ్యకుండా మేడ మెట్లెక్కి వస్తూ తనకు కనిపించింది. ఆ పిల్ల మొహాన తాండవిస్తున్న అసహజమైన చిరునవ్వు చూస్తే తనకు భయం వేసింది. వెంటనే తను శారద వెనకే పైకి వెళ్ళింది, మాట్లాడాలని. తను నోరు కట్టుకొని ఏం లాభం? శారద తన మాట వినకపోతే తనకేం నష్టం?

"ఏ మమ్మా, శారదా? చాలా సరదాగా ఉన్నావే? ఏదో ఉందే!" అన్నది తను.

శారద పడుకున్న మంచం మీద చివాలున లేచి కూర్చుని మొహం చిట్లిస్తూ, "చూడ లేకుండా ఉన్నావా?" అంది. అదీ వరస!

అసలు సంగతికి రావటం తనకు చాలా కష్టమయింది. "ఎందుకు పెట్టుకున్నా వీ ఛండాలపు పని?" అని అంతరాత్మ తన్ను తిడుతూనే ఉంది. కాని తన మనస్సులో ఉన్నది బయట పెట్టేసింది.

"ఇటువంటి పని ఎందుకు శారదా? నీ చక్కదనాన్నీ, నీ వయస్సునూ అడగని వాడిది పాపంగా ఎందుకు జారవిడుచు కుంటావు? ఆ మాత్రం అభిమానం ఉండకూడదా నీకు? నీకు ఎంత మంచి మొగుడు రాకూడదు! కొంచెం జాగ్రత్తగా ఉంటే నీకు సుఖమూ గౌరవమూ దక్కేటప్పుడు కొద్ది సుఖానికి గౌరవాన్నీ శాశ్వతమైన సుఖాన్నీ బలిచేస్తావు?"

ఆ మాటలు ఎట్లాగైతేనేం తన నోటివెంట వచ్చేసినై. తన పని మూడు వంతులు అయిపోయింది!

ఆ తృప్తి శారద తనకు దక్కనివ్వ దలచుకో లేదు. శారద మండి పడ్డది, మతిలేని దానల్లే మాట్లాడింది.

"నాకు సుఖం కావాలి!....నువు నాకు నీతులు బోధించక్కర్లేదు. నీకేం తెలుసును, సుఖమేమిటో? యాభైయేళ్ళ మొగుణ్ని చేసుకున్న దానివి! నీ మొగుడు వంటదానిని పెట్టుకుని వంటింటో పడుకుంటే చూస్తూ ఊరుకున్న దానివి!.... నా అందమూ వయస్సూ నాకెందుకు? ఎవరు నాకు సుఖం ఇస్తే వాళ్ళకవి ధారపోస్తాను. నా అందాన్నీ వయస్సునూ నలిపేసేవాడు కావాలి నాకు - ఏం చేస్తావో చెయ్యి!.... వాటిని గౌరవం కోసం అమ్ముకోమనేగా నీ సలహా? నేను బోగం దాన్ని కాను!" అని ఎగిరిపడ్డది శారద, ఎవరన్నా వింటారన్న భయం కూడా లేకుండా.

తను తన ఓర్పునంతా వినియోగించి మృదువుగా, "అట్లా అనకమ్మా! దేన్ని కాని గౌరవానికి అమ్ముకోవటం అగౌరవం కాదు. అది ఒకటే గౌరవమయిన అమ్మకం!.... నాకు నిజంగా తెలియదు సుఖం ఏమిటో! కాని నువు చెయ్యాలనీ ప్రయత్నం చేస్తున్న పనివల్ల ప్రమాదం చాలా ఉంది. నేను నీకు బొల్లినీతులు చెప్పటం లేదు.... ఆ మనిషి నిన్ను సుఖపెట్టటానికి కూడా అర్హుడు కాడు. అయితే రహస్యం దేనికి? నువు పెళ్ళి కాదగిన పిల్లవు. నిన్ను బహిరంగంగా పెళ్ళిచేసుకోరాదా? ఇట్లా చాటుగా ఏవనిగాని చెయ్యటం నీ అభిమానానికి అత్యంతరం కాదూ?" అని చెప్పి చూసింది. శారద తలకు ఇవేవీ ఎక్కలేదు.

"నన్ను గట్టిగా కావలించుకున్నాడు. ముద్దు పెట్టుకున్నాడు. నా వళ్ళు పరవశమైపోయింది. నేనింతటితో ఆగను. అనుభవించాలిసిన సుఖమంతా అనుభవించి ఆపైన చస్తాను. నీకెందుకు? నువు తోకతెగిన నక్కవు! నీ మాట వినను" అని శారద మూర్ఛించింది.

భాస్కర్రావు నాలుగు రోజులపాటు ఇంట్లో ఉంటే ఎంత బాగుండును!

శారదను చూస్తూ వదిలివెయ్యటం హాస్యాస్పదంగా ఉంది. తను చెయ్య గలిగింది చూడబోతే ఏమీ కనిపించదు. ఇందులో తనకు తోడు కావాలి. ఆ పనికి భాస్కర్రావే తగు!....

అతను బొత్తిగా కంటికి కనిపించటమే మానేశాడు. ఎక్కడ తిరుగుతాడో, ఏం చేస్తాడో, ఒక్కొక్కసారి భోజనం కూడా ఎక్కడ చేస్తాడో ఎవరికీ తెలి యదు_ ఎవరికీ అక్కర్లేదు. అతను నాలుగు రోజులు అంటిపెట్టి ఇంటో ఉంటే బాగుండును; ఈ అడవిలోనైనా తన ప్రాణానికి వెన్నెల కాసినట్టవుతుంది!

*     *     *

నాలుగు రోజుల పాటు ఇల్లు కదలకుండా ఉండమంటే అతను ఎందు కన్నాడు. తను చెప్పలేక పోయింది. తీరా చెప్పవలసి వచ్చేటప్పటికి శారద సమస్యలోకి అతన్ని ఈడవకుండా తన వల్ల కాదా అనిపించింది.

తను ఏం చెయ్యటానికీ తోచక, "ఊరికేనే అన్నాను. నాకు బొత్తిగా ఏమీ తోచటంలేదు. నేను చేసేటందుకు పనిలేక చెడిపోతున్నాను, భాస్కర్రావు!" అంది.

భాస్కర్రావుకు నోటితో మాత్రమే నవ్వే నేర్పున్నది. అతను ఇప్పుడు కూడా అట్లాగే నవ్వి, "ఇంట్లోనే ఉందును కాని అందువల్ల ప్రమాదం ఉంది," అన్నాడు.

"ఎవరికి ప్రమాదం?"

"నా వేదాంతానికి. వేదాంతి అయినవాడు డబ్బుగలవాడి మాదిరిగానే ముఖ్యంగా చూసుకోవలిసిం దేమిటంటే తన సొత్తుకు ప్రమాదం జరగకుండా ఉండటం."

అతని కళ్ళు చూస్తే తనకు జాలివేసింది. "పోనీ నీకు యిష్టం లేకపోతే మానెయ్యి." అన్నది తను.

"పోనీ ఒక్కసారికి నా వేదాంతాన్ని పరీక్ష చేస్తాను, నీ కోసం. ఇంత వరకూ అటువంటి సాహసం చెయ్యలేదు." అన్నాడు భాస్కర్రావు........

అతను ఇంట్లో ఉండడానికి ఒప్పుకున్న మరుక్షణమే తనకొక చక్కని ఉపాయం తట్టింది.

శారద చిటికేశ్వరపు చెట్టుకింద పచారు చేసే వేళలు తనకు తెలుసు. ఉదయం పదింటికీ, మధ్యాన్నం రెండింటికీ సాయంకాలం ఏడింటికీ. ఆయా వేళలకు ఆ ప్రాంతాల తనే పచారు చెయ్యటం మొదలు పెట్టింది - సాధ్యమై నంత వరకు ప్రహరీకి సమీపంగా - రోడ్డుమీది వాళ్ళకు తన తలపై భాగం తప్ప కనిపించటానికి వీలులేకుండా. ఇట్లా చెయ్యటం వల్ల శారద ఆట కట్టయింది. ఆ పిల్ల ఆ చాయలకు రాలేదు....

సాయంకాలం ఏడువ్నర వేళకు వచ్చింది ఉత్తరం, గోడ అవతలనించి! అది తీసుకుని గబగబా తనుపైకి వెళ్ళి చదువుకున్నది.

"పదకొండింటికి"

అంతే! ఫలానావారికని లేదు. ఫలానందుకని లేదు. కాగితం నలచద రంగా నన్నా లేదు, చించి పారేసిన ముక్క మాదిరిగా ఉంది. మొదటి అక్షరం దాదాపు సొంతంగా చినిగిపోయింది.....తెలివైన ఉత్తరం!. ..

* * *

గడియారం పదకొండు కొట్టగానే తను నిశ్శబ్దంగా మేడమెట్లు దిగి వచ్చింది. నేరుగా చిటికేశ్వరపు చెట్టు దగ్గిరకు వెళ్ళింది. చెట్టు చాటునుంచి ఒక ఆకారం ఇవతలికి వచ్చింది. తన గుండె దడదడ లాడటం మొదలు పెట్టింది. తన కిదంతా ఎందుకు వచ్చిన తద్దినం?....

"శారదా!'' గుడ్డి వెధవ! "ఇంత ఆలిస్యం...."

కనుక్కున్నాడు తను శారద కాదని. కొయ్యబొమ్మల్లే నిలబడ్డాడు.... ఇది దుశ్శకునం అవునో కాదో నిర్ణయించ లేకుండా....

ఆ రెండు మాటల్లోనే ఎంత అధికారం!.... "ఇంత ఆలిస్యం!" ఆ రెండు ముక్కలూ తన కెంత ఉపకారమైనా చేసినై. పోతున్న తన ధైర్యానికి ప్రాణం పోసినై.

అతన్ని సమీపించి, "నేను శారదను కాను.... శారదతో నీకేం పని?'' అన్నది తను.

వాడి నోట మాట లేదు.

"ఇట్లా దొంగతనంగా ఇళ్ళల్లో ప్రవేశించే నువ్వు ఎవడి వనుకోవాలి దొంగవనా, దొరవనా?.... శారద ఎవరనుకున్నావు? శారద మీద నీకు ప్రేమ ఉంటే రేపు పగటివేళ వచ్చి వాళ్ళ నాన్నగారిని అడుగు శారదను పెళ్ళి చేసు కుంటానని. అందుకు తగిన వాడివైతే శారదను నీకిచ్చి పెళ్ళి చేస్తారు. అంతే కాని ఇదేం పని?...."

ఆ వచ్చినవాడు అకస్మాత్తుగా వీపు త్రిప్పి ప్రహరీ గోడదాకా ఒక్క దూకు దూకి చెంగున గోడ గెంతి మాయమైనాడు. రోడ్డుమీద వాడు పారిపో తున్న అడుగుల చప్పుడు వినవచ్చింది.

తను ఒక్కక్షణం దిగ్భ్రమచెంది చేసేదిలేక వెనక్కు తిరిగింది. భోజనాల సావడి పక్క తలుపు తెరుచుకుని తన భర్త వస్తున్నాడు. ఆ వాకిట్లో కనపడీ కనపడకుండా వంటలక్క!

"ఇదుగో - మాట - ఇట్లారా - నిన్నే!"

తను భర్తను సమీపించింది. శారద గుట్టు బయట పడకుండా ఏం చెయ్యలి? ఎట్లా బొంకాలి? ఆయనకు ఎంత కనిపించింది? ఎంత వినిపించింది?

"ఏం చేస్తున్నావక్కడ? అన్నాడు భర్త తనను కలుసుకుని.

"ఏమీ లేదు," అని జానకి బొంకి చూసింది?

"ఆ గోడ దూకిన వా డెవడు? నీతో వాడి కేం పని?"

తన నోట మాట రాలేదు ఆశ్చర్యంతో. కొంపతీసి వాడు తన కోసం వచ్చాడని తన భర్త అనుకోటం లేదు కద!.... పోనీ, పాపం, శారద....

"అందుకనే కాపూలు, పాపం పగలల్లా అక్కడే తారట్లాడు తున్నది!" అని కోకిల కంఠం భోజనాల సావిడి వాకిలివేపు నించి అస్పష్టంగా వినవచ్చింది

ఇంకొక గుడ్డివెధవ! రోజూ శారద తారట్లాడుతుంటే దాని కళ్ళు ఏమైనయో!.... ఇందుకనే భాస్కర్రావు.

తన మీద పడేవరకూ తను భర్త చేతిలోఉన్న కర్రను గమనించలేదు, గమనించినా దానికి తనతో పని ఉంటుందని తోచలేదు.

తనవంటి అభిమానం గల స్త్రీ దెబ్బలు తినటం నిజంగా ఎంత కష్టం! ఈ దెబ్బలే సకారణంగా తినటమయితే ఇంకా ఎంత కష్టంగా ఉండునో!.... మొదటి రెండు మూడు దెబ్బల తరవాత తనకు శరీరబాధ కూడా తెలియటం లేదు. కాని మనస్సు చలిస్తున్నది. మతిపోయినట్లవుతున్నది. ఏమనాలో ఏం చెయ్యాలో తోచటం లేదు - అట్లా కొయ్యబొమ్మల్లే నిలబడి దెబ్బలు తినటం తప్ప ఇంకేమీ తోచటం లేదు........

* * *

భాస్కర్రావు వచ్చి అడ్డుపడకపోతే తన శిక్ష ఎక్కడ ఆగి ఉండునో! ఎందుకంత ఘోరం చేశాడు భాస్కర్రావు? తండ్రి చేతిలో కర్ర లాక్కుని తండ్రినే చావకొట్టేటంత పని అతను చేస్తాడని తను ఊహించనైనా లేదు. అత నంత అవశుడై ఉండగా తను ఎప్పుడూ చూడలేదు. ఎంత ఆలోచించినా ఆ పని అతను చెయ్యతగిన పనిగా తోచటం లేదు.

కాని తన భర్తా ఆ వంటలక్కా చూస్తుండగానే భాస్కర్రావు తన నడుము చుట్టూ చెయ్యివేసి ఇంట్లోకి నడిపించుకు రావటం మాత్రం తనకు ఆశ్చర్య కరంగా లేదు. అటువంటి నైతిక ధైర్యం కలవాడు ఒక్క భాస్కర్రావే ఉన్నాడు తను ఎరిగినంత వరకు!

మేడ మెట్లెక్కి వస్తుండగా తను ఆగి, "మీ నాన్నగారిని ఎందుకు కొట్టావు, భాస్కర్రావు? అదేమిటి! నీ కళ్ళు —" అన్నది. ఆ పైన తన నోటమాట రాలేదు, అతని కళ్ళు అనుమానాస్పదంగా తళతళలాడుతున్నై!

"కళ్ళుకాదు - వేదాంతం!.... నేను భయపడ్డంతా అయింది – నేను భయపడుతున్న దానికంటె కూడా త్వరగా!........ కాస్త పరీక్ష చేసేటప్పటికి నా వేదాంతం చూడు ఏమయిందో!"

భాస్కర్రావు తన మొహం పైకెత్తి తన అంతరాత్మను పరీక్ష చేస్తున్న వాడల్లే తన కళ్ళలోకి చూసి చివరకు తన్ను ముద్దు పెట్టుకున్నాడు – తేలికగా, ఉద్రేకం లేనివాడల్లే.

"అయిపోయింది! నేను వేదాంతిని కానని తేలిపోయింది!.... నా కళ్ళ ఎదట ఉన్న ఈ అనాగరికతా, అవినీతీ, ఈ పాతకమూ – ఇదంతా నేను ఒంటరిగా సహించలేను. సహించలేనని ఇవాళ రుజువై పోయింది. ఇదంతా నాతో పాటు నువు కూడా పంచుకుంటావా?"

"భాస్కర్రావు!........ ఇందులో నా తప్పేమీలేదని నీకేం నమ్మకం?" అన్నది తను.

"నిన్ను మా నాన్న కొట్టటానికి ఎన్నడూ తగిన కారణం ఉండటానికి అవకాశం లేదు........ అదీ కాక నేను నిన్నూ ఎరుగుదును, ఆయన్నూ ఎరుగుదును; ఆయన నిన్నెరగడు.... అయినా ఏం జరిగిందో చెప్పు!"

"ఏమీ లేదు శారద – నేను కాకపోతే ఈ దెబ్బలు శారద తిని ఉండేది!"

ఒక క్షణకాలం పాటు ఇద్దరూ ఎవరి ఆలోచనలో వారున్నారు.

"నే నడిగిన దానికి సమాధానం చెప్పవా?........ ఈ అడివిలో నాకు తోడుగా ఉండవా?"

"ఉంటాను. భాస్కర్రావు.... మనిద్దరి గతీ ఏమిటి?"

"వెలి ........ ఎట్లాగూ తప్పదు - ఇవాళ నేనిట్లా ప్రవర్తించిన తరవాత... .... నీ కభ్యంతరం లేకపోతే!"

"నా కభ్యంతరం లేదు!" అన్నది తను ధైర్యంగా........

(మొదటి ముద్రణ : ఆగస్టు 1937, స్వగతం కథల సంపుటి, యువ కార్యాలయం, తెనాలి)